# మనీ మేకర్స్

అప్పటి వరకు రిసీవ్ చేసుకున్న ఎమ్.ఓ.ల టోటల్ కౌంట్ చేసి ఫైలు చేస్తున్నాడు జ్ఞానేశ్వర్.

హనుమంతు ఎన్వలప్ కవర్సుపై అడ్రసులు వ్రాస్తున్నాడు. ఆఫీసుకు వస్తూనె అడిగాడు గోపీనాథ్ "మిస్టర్ జ్ఞానేశ్వర్, ఈ వారం కలక్షన్ ఎంత" అని.

"పదహారు వేల నూట పన్నెండు సార్" చెప్పాడు జ్ఞానేశ్వర్.

"వెరీగుడ్. అయితే టోటల్ ఎమవుంట్ ఒక లక్షా అరవై ఒక్క వెయ్యీ నూట యిరవై రూపాయలన్న మాట."

"ఎస్ సార్."

"పేపరు ప్రకటనకు ఏడు వందల అరవై, స్టేషనరీ ఖర్చు నూట యిరవై రూపా యలు, పోస్టల్‌స్టాంపులకు ఎనిమిది వేల ఏబయి ఆరు రూపాయలు పోనూ ఎంత వుం టుందో చూసి చెప్పు" అంటూ తన సీటులో కూర్చున్నాడు గోపీనాథ్. "చూడు, ఒక టెన్ కూడా మైనస్ చెయ్యి" అన్నాడు మళ్ళీ.

చక చకా లెక్కలు వేసి నిముషంలో చెప్పాడు జ్ఞానేశ్వర్. "ఒక లక్షా యాభై రెండు వేల నూట డెబ్బై రెండు రూపాయలు సార్."

గోపీనాథ్ ముఖం బల్బ్‌లా వెలిగిందోక్షణం. "మీ యిద్దరికీ ఈ నెల జీతం కాక టెన్‌పర్సంట్ బోనస్ యివ్వబోతున్నాను."

హనుమంతు, జ్ఞానేశ్వర్ "థ్యాంక్స్ సార్" చెప్పారు కోరస్‌లా

"ఈరోజు నుండి ఆంధ్రా ఏరియాకు వెళ్ళే న్యూస్ పేపర్స్ అన్నిటికీ ప్రకటన యివ్వండి" అంటూ యింటర్‌కంలో పిలిచాడు లేడి టైపిస్ట్ నీరజను.

నీరజ లోపలికి వస్తూనే సార్ పిలిచారా అనే లోపున "నీరజా మనం అర్జంట్‌గా బయటకు వెళ్ళాలి. కమాన్ క్విక్" అంటూ బయటకు దారి తీశాడు ఆమె భుజంపై చెయ్యివేసి.

"ఒరేయ్ జ్ఞానీ" జ్ఞానేశ్వర్‌ను పిలిచాడు హనుమంతు జ్ఞానేశ్వర్ తలత్రిప్పి చూడటంతో–

"సార్‌కు కలక్షన్ గురించి రాంగ్‌గెందుకు చెప్పావురా"

"కావాలనే చెప్పాన్రా కోతీ."

హనుమంతును కోతీ అని పిలవటం సరదా అయితే పిలిపించుకోవటం హనుమంతుకు చాలా యిష్టం.

యిరవై వేలు కలక్షనయితే చాలా తక్కువగా చెప్పడం, బాస్ నమ్మెయడం హనుమంతుకి ఆశ్చర్యంగా వుంది.

అంతేగాక రికార్డ్స్‌లో జ్ఞానేశ్వర్ చెప్పిన ప్రకారమే పదహారు వేల నూట పన్నెండు రూపాయలు మాత్రమే నోట్ చేసి వుంది.

"అంటే... మిగతా ఎమ్.ఓల మా ట?" అడిగాడు హనుమంతు

"మనం చెరిసగం పంచుకో బోతున్నాం" చెప్పాడు జ్ఞానేశ్వర్.

మూడు వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది ఎమ్.ఓ.ల మొత్తం పైకం ముప్పయ్ ఎనిమిది వేల ఎనభై ఎనిమిది రూపాయలన్న మాట. యిద్దరూ పంచుకుంటే హనుమంతు వాటాకు ఒక వెయ్యి తొమ్మిది వందల నలభై నాలుగు రూపాయలు.

అమ్మో!

ఒళ్ళు జలదరించింది హనుమంతుకి. నెలంతా కష్టపడితే అయిదు వందల కంటే సంపాదించలేని హనుమంతుకి ఓ ప్రక్క ఆశ్చర్యం మరో ప్రక్క భయంగా వుంది.

ఒక్కసారిగా అరిచాడు "యిది అన్యాయంరా" అంటూ

"వాట్?"

"బాస్‌కు మనం చాలా అన్యాయం చేస్తున్నాం."

వీడి మొదడును యింకా శుద్ధి చెయ్యాలనుకున్నాడు.

"రేయ్ హనుమంతూ" అంటూ లాలనగా పిలిచాడు జ్ఞానేశ్వర్.

పలికాడు ఆ హనుమంతు.

"మన బాస్ చేసే బిజినెస్ ఏమిటిరా?"

"నీకు తెలీక అడుగుతున్నావా?"

"తెలిసే అడుగుతున్నాను గానీ నా ప్రశ్నకు జవాబు చెప్పురా కోతీ" గీతోపదేశము పదేశించేవాడిలా అన్నాడు జ్ఞానేశ్వర్.

"డబ్బు సంపాదించడమెలా? కష్టపడకుండా సక్రమమార్గం ద్వారా డబ్బును ఎలా సంపాదించాలో తెలియజేస్తాం. వివరాలకు పదిరూపాయలు ఎమ్.ఓ. చెయ్యండి అంటూ ప్రకటనను చదివి వినిపించాడు. హనుమంతు.

"ప్రతి ఒక్కడూ డబ్బు సంపాదించే మార్గాన్ని తెలుసుకోవాలనేగదా పదహారు వేల నూట పన్నెండు మంది పదిరూపాయల చొప్పున ఎమ్.ఓ. చేశారు.

"అవును."

"వీళ్ళందరికీ మన బాస్ చెప్పబోయే ఆ మార్గమేమిట్రా కోతీ" అడిగాడు జ్ఞానేశ్వర్.

"మీరు కూడా మాలాగే సంపా దించండి" అని ప్రింటు చెయ్యబడిన ఈ పేపర్ని పోస్ట్‌లో పంపబోతున్నాడు అవునా?"

"అవును"

మనకు ఆయనిచ్చే జీతాలు, యితర ఖర్చులు పోనూ ఆయనకు మిగిలేదెంత?

కళ్ళు మూసుకొని మనసులోనే లెక్కలు వేస్తూ క్షణం తరువాత "ఒక లక్షా ఏబయ్ ఒక్క వెయ్యీ నూట డెబ్బయి రెండు'' అన్నాడు హనుమంతు.

మన బాస్ అమాయకుల దగ్గర లక్షల్లో లాగుతుంటే మనం బాస్ దగ్గర వేలల్లో ముంచేస్తున్నామన్న మాట. ఈ అవకాశం మనకు ఎప్పుడూ రాదు. కాబట్టి యిలా వచ్చినప్పుడల్లా వుపయోగించుకుందాం ఏమంటావ్'' అడిగాడు జ్ఞానేశ్వర్.

''సరే కొండంత అండ నువ్వుండగా నాకు భయమేల మిత్రమా'' అంటూ సంతోషంగా నాటక ఫక్కీలో తన సంతోషాన్ని వ్యక్తపరిచాడు హనుమంతు.

"యిదే మరి ఛీటింగ్ ఫర్ ఛీటింగ్" అంటే.

★★★★★

'సిగ్నల్ కంపెనీ (రిజిష్టర్)'లో దొరకని వస్తువంటూ లేదు. కంపెనీ ప్రారంభించి వారం రోజులు కూడా కాలేదు. రూపాయి విలువ చేసే బాల్‌పెన్ నుండి లక్షల రూపాయలు విలువ చేసే మారుతీ కారు వరకు దొరుకుతాయి. అరవై పర్సంటు డిస్కౌంటు కూడాను. మార్కెట్ రేటుకంటే అంత తక్కువ ధరకే సప్లయి చేస్తుంది సిగ్నల్ కంపెనీ.

పి. శేషవర్ధన రావు

కస్టమర్స్ తమకు కావలసిన ఐటమ్స్‌ను బుక్ చేసుకుని మార్కెటులో వున్న రేటుకి అరవై పర్సంటు మైనస్ చేసి నలభై పర్సంటు ప్రైకం పే చేస్తె చాలు రెండు నెలల తరువాత కస్టమర్ కోరుకున్న ఐటమ్ డెలివరీ చెయ్యబడుతుంది

రోజు రోజుకి కస్టమర్స్ క్యూ పెరిగిపోతోంది. లేడీ బుక్కింగ్ క్లర్కులకు, సిగ్నల్ కంపెనీ యొక్క పబ్లిసిటీ భామలకి క్షణం తీరికవుండుటలేదు.

టివి, ఫ్రిజ్, టు–ఇన్–వన్, డైనింగ్ టేబుల్, సోఫాసెట్, సైకిల్స్, స్కూటర్స్, మోపెడ్స్, ఆటోలు, ట్రక్కులు... ఒహ్ ఒక్కటేమిటి?

ఎన్నో!

ఎన్నెన్నో!!

ఎవరికి కావలసిన ఐటమ్స్ వాళ్ళు బుక్ చేసుకుంటున్నారు.

రెండునెలలగడిచాయి.

డెలివరీస్‌ప్రారంభమయ్యాయి.

ఐటమ్స్ తెచ్చుకున్న వారిలో కనిపిస్తున్న సంతోషం.

వారిని చూసి తాము కూడా తెచ్చుకోవాలన్న ఆరాటం...

బుక్ చేసుకుంటున్న కస్టమర్స్ సంఖ్య రెట్టింపుకు రెట్టింపయ్యింది.

అయితే అరవై శాతం డిస్కౌంటుతో ఐటమ్స్ సప్లయ్ చేస్తున్న సిగ్నల్ కంపెనీకి చేకూరేప్రయోజనం ఏమిటన్న అనుమానం వచ్చిన వాళ్ళూ వున్నారు. వాళ్ళకు సరియైన జవాబు దొరక్కపోయినా ఏదయితే అదే అవుతుందనుకొని బుక్ చేసుకున్నారు. ఏ ఐటమూ బుక్ చేయకుండా గమనిస్తున్న వాళ్ళూ లేకపోలేదు. ఒక్క ఆరు నెలలు గడిచింది. సిగ్నల్‌కంపెనీ నడుస్తూనేవుంది.

ప్రజలలో నమ్మకం పెరిగింది.

కంపెనీ బిజినెస్ కోట్ల రూపాయల్లో వుంది.

బ్లాక్ మనీ బయటకు తెచ్చేమార్గం యిది. అందుకే ఆ కంపెనీ వారు ఈ రూపంగా ప్రజలకు సేవ చేస్తున్నారు అన్న వదంతి పుట్టింది.

కస్టమర్స్ ద్వారా వచ్చిన మనీని వేరే బిజినెస్‌కు తరలించబడతోంది. కస్టమర్స్‌కిచ్చే రెండు నెలల డెలివరీ సమయాన్ని వడ్డీ ద్వారా పూడ్చుకోవడం జరుగుతోంది అంటూ రకరకాలుగా వదంతులు పుట్టాయి.

ఏదయితేనేం?

కస్టమర్స్ సంఖ్య లక్షల్లో వుంది.

ఓ రోజు–

హఠాత్తుగా జరిగింది.

సిగ్నల్ కంపెనీ మూత పడిందన్న పుకారు...

పుకారు కాదు నిజమేనని నిర్ధారణ అయింది.

చాలామందిఆవేశపడిపోయారు.

కొంతమందిడీలాపడిపోయారు.

మరి కొంత మంది తేలుకుట్టిన దొంగల్లా కిక్కురుమనకుండామిన్నకుండిపోయారు.

కంపెనీ తాళాలు పగలగొట్టి చూస్తే ఏముంది లోపల! చెత్త చెదారం తప్ప.

రాత్రి రాత్రే మకాం ఎత్తేశారని తెలిస్తే గదా!

కంపెనీని, కంపెనీ నడిపిన వారిని దుమ్మెత్తిపోసింది స్త్రీలోకం.

అప్పుచేసి అత్యాశకు పోయి బుక్ చేసుకున్న సగటు మానవుడు శూన్యంలోకి చూస్తుండిపోయాడు.

"ప్చ్" అంటూ నిరాశపడి పోయాడు మధ్యతరగతివాడు.

లేనివాళ్ళ బాధలలా వుంటే వున్నవాడు హుందాగా పోలీస్ రిపోర్టిచ్చి వూరుకున్నాడు చేసేది లేక.

కోట్లాది రూపాయలతో మాయమైన సిగ్నల్ కంపెనీ అధినేత ఈశ్వర చంద్ర రాజేంద్ర వీరకుమార్ అని రికార్డ్స్ చెబుతున్నాయి గానీ... అతడెవరో... ఎలా వుంటాడో... ఎక్కడ వుంటాడో! ఎవరికయినా తెలుసా! ఎవ్వరయినా చూశారా!!!

దేవుడికయినాతెలుసా!

అమెరికాలో టాప్ టు బాటమ్ వరకు ప్రజలు ఎవరి పనివారే చేసుకుంటారు. టైమ్ ఈజ్ మనీ.

అధికారులకు వారి వారి అర్హతలను బట్టి నౌకర్లు, బంగళాలు, వాహనాలతో సహా సకల సౌకర్యాలు సమకూర్చుతున్న ఈ (మన) దేశంలో–

కష్టపడకుండా డబ్బు సంపాదించాలన్న ఆశతో వుండే సోమరిపోతులూ యిలాంటి మార్గాలకై మీ అన్వేషణను మరల్చుకోండి.

ఓ యువతా నువ్వెప్పుడు బాగుపడతావు.

ఛీటింగ్‌ను ఛీకొట్టు.

